క్లుప్తంగా

నెట్టికంటుడిని దర్శించుకున్న డీఐజీ



ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న డీఐజీ లక్ష్మి, కుటుంబ సభ్యులు

గుంతకల్లు రూరల్: విజయవాడ కమ్యూనికేషన్స్ డీఐజీ ఎస్.ఎస్.జే లక్ష్మి కుటుంబ సమేతంగా శుక్రవారం సాయంత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఆమెకు ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో డీఐజీ కుటుంబ సభ్యుల పేరున ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు వారికి స్వామి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

రికార్డుల తనిఖీ



నార్పలలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటేశులు

నార్పల: స్థానిక పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను డీఎస్పీ వెంకటేశ్వర్లు శుక్రవారం తనిఖీ చేశారు. పెండింగ్ కేసులు, ఫ్యాక్షన్ గ్రామాలపై ఎస్‌ఐ సాగర్‌తో ఆరా తీశారు. మండల వ్యాప్తంగా మట్కా,పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనపై దృష్టి సారించాలన్నారు. దొంగతనాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల్లో పోలీస్ వ్యవస్థపై ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

పరామర్శ



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కేతిరెడ్డి రమాదేవి

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణంలోని గాజుల క్రిష్టప్ప వీధిలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ మహిళా రాష్ట్రకార్యదర్శి పేరం స్వర్ణలత అత్త పేరం లక్ష్మీదేవి మృతి చెందడంతో తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సతీమణి కేతిరెడ్డి రమాదేవి పేరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె వెంట మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ ఓబులరెడ్డి, నరసింహారెడ్డి ఉన్నారు.

బాలిక అదృశ్యం

గార్లదిన్నె: మండలంలోని కేశవాపురంలో ఓ బాలిక అదృశ్యమైంది.శుక్రవారం ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా మాట్లాడుతూ గ్రామానికి చెందిన బాలిక పదో తరగతి చదువుతోందన్నారు. గురువారం రాత్రి బాలిక తల్లిదండ్రులతో కలసి ఇంట్లో నిద్రిస్తూ రాత్రి 11 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేద న్నారు. చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఊళ్లలో వెతికినా బాలిక ఆచూకీ లభ్యం కాకపోవడంతో తల్లిదండ్రులు గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. బాలిక మిస్సింగ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ బ్రాంచ్ సెక్రటరీగా రామ్‌నాయక్



గుత్తి: గుత్తి డీజిల్ షెడ్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ బ్రాంచ్ సెక్రటరీగా రామ్ నాయక్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. అదే విధంగా చైర్మన్‌గా మనోజ్, కోశాధికారిగా మధును ఎంపిక చేశారు. రామ్ నాయక్ వరుసగా రెండోసారి బ్రాంచ్ సెక్రటరీగా ఎంపికయ్యారు. ఆయనను ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ సభ్యులు, నాయకులు అభినందించారు.

పైప్‌లైన్ మరమ్మతుల పర్యవేక్షణ



పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ జబ్బార్‌మియా

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో సత్య సాయి తాగునీటి పథకానికి సంబంధించిన పైప్‌లైన్ రెండు చోట్ల డ్యామేజీ అయింది. దీంతో తాగునీరంతా వృథా అవుతోంది. మున్సిపాలిటీలోని పలు కాలనీలకు తాగునీరు సరఫరా నిలిచిపోయింది. వాటర్ వర్క్స్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన జేసీబీ సాయంతో పైప్‌లైన్ మరమ్మతులు పనులు చేపట్టారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా పైప్‌లైన్ మరమ్మతు పనులను పర్యవేక్షించారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

బాబు ష్యూరిటీ.. బాదుడు గ్యారంటీ

- కరెంట్ చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ పోరుబాట
- గుంతకల్లు, శింగమల, తాడిపత్రిలో భారీ నిరసన ర్యాలీలు

విద్యుత్ చార్జీల పెంపుపై వైఎస్సార్‌సీపీ భగ్గుమంది. అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు గుంతకల్లు, శింగనమల, తాడిపత్రి నియోజకవర్గ కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన ర్యాలీలు విజయవంతమయ్యాయి. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలంటూ డిమాండ్ చేశారు.



గుంతకల్లులో ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు



శింగనమలలో ర్యాలీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆలూరు సాంబశివారెడ్డి, సమన్వయకర్త వీరాంజనేయులు, పార్టీ నాయకులు

గుంతకల్లుటౌన్: అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలను పెంచబోనని ప్రకటించిన చంద్రబాబు.. తన ఆరు నెలల పాలనలో ట్రూ అప్ చార్జీల పేరిట రూ.15,485 కోట్ల భారాన్ని మోపి ప్రజల నడ్డి విరిచాడు. సూపర్ సిక్స్ పథకాలేమో గానీ, ప్రజలపై భారాలు, బాదుడు మాత్రం అమలు చేయడం తథ్యమని స్పష్టంగా తెలుస్తోందని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ధ్వజమెత్తారు. కరెంట్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు శుక్రవారం స్థానిక ఆ పార్టీ నాయకులు కరెంట్ చార్జీల బాదుడుపై పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత టీవీ.స్టేషన్ సర్కిల్‌లోని దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి శివరామిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. రాయల్‌సర్కిల్, పొట్టిశ్రీరాములు సర్కిల్, బీరప్పగుడి సర్కిల్, హనుమాన్‌సర్కిల్ మీదుగా ఆలూరురోడ్‌లోని విద్యుత్ నిలయం వరకూ ర్యాలీ కొనసాగింది. ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట జరిగిన నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ అలవిగాని హామీలతో గద్దెనెక్కడం, అధికారంలోకి వచ్చాక ప్రజల్ని మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యన్నారు. కరెంట్ బిల్లులు ముట్టుకుంటునే షాక్ కొడుతున్నాయని, ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతున్నా ప్రశ్నిస్తానన్న పవన్ కళ్యాణ్ ఎక్కడికెళ్లాడని ఆయన నిలదీశారు. ట్రూ అప్ చార్జీల పేరిట ప్రజలపై మోపిన రూ.15,485 కోట్ల భారాన్ని ప్రభుత్వమే చెల్లించాలన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి, అన్నదాతలను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ప్రజావ్యతిరేక ప్రభుత్వంపై పార్టీశ్రేణులు ఇదే ఉత్సాహంతో పోరాడేందుకు జూలు విదిల్చాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని ట్రాన్స్‌కో ఏడీఈ నాగేంద్రకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, మైమూన్, పార్టీ జిల్లా కార్యదర్శి గాదిలింగేశ్వరబాబు, మున్సిపల్ మాజీ చైర్మన్లు రామలింగప్ప, రామాంజినేయులు, పార్టీ మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షుడు సుంకప్ప, గుంతకల్లు, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్‌లు ఎస్వీఆర్ మోహన్, భీమలింగప్ప, పెద్మక చెన్నకేశవరెడ్డి, మల్లయ్యయాదవ్, గుత్తి పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు హుసేన్‌పీరా, గోవర్ధన్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, ప్రవీణ్‌యాదవ్, పామిడి పట్టణ, మండల అధ్యక్షులు జోజేడె కుమార్, నారాయణరెడ్డి, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, మాజీ కన్వీనర్ బొల్లు వెంకటరామిరెడ్డి, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, కోఆప్షన్‌సభ్యులు, వార్డు ఇన్‌చార్జ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడిపత్రిలో..

తాడిపత్రిటౌన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తాడిపత్రి పట్టణంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొనిదల రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం తాడిపత్రి ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ముందుగా ఆయన తన నివాసం నుంచి పెద్ద ఎత్తున ఆపార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లో ఉన్న దివంగతనేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ట్రాన్స్‌కో కార్యాలయం చేరుకున్న ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాడాక విద్యుత్ చార్జీలు అమాంతం పెంచడంతో పేదలపై మోయలేని భారం పడుతోందన్నారు. గత ఆరునెలల్లోనే ప్రజలపై దాదాపు 600 కోట్ల విద్యుత్ భారం పడిందన్నారు. జనవరి నుంచి మరో తొమ్మిదిన్నర కోట్ల రూపాయలు అదనపు భారం పడే అవకాశం ఉందన్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా 200 యూనిట్లు ఇస్తుంటే .. కూటమి ప్రభుత్వం ఆ వర్గాలను మోసం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వ నిర్ణయంతో ప్రజలపై దాదాపు రూ.15 వేల కోట్ల భారం పడనుందని, వెంటనే ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి డిమాండ్ చేశారు. అనంతరం ట్రాన్స్‌కో ఏడీ ప్రభాకర్‌రావుకు వినతిపత్రం అందజేసారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రఫీ, ఆది, జబ్రా, ముచ్చుకోట యోగేశ్వరరెడ్డి, అమ్మలదిన్నె రామచంద్రారెడ్డి, చెన్నారెడ్డి, తిమ్మాపురం విశ్వనాథరెడ్డి, షాషా, కృష్ణారెడ్డి, సమీర్, గౌస్, సంజీవ, రవి, శామీర్ తదితరులు పాల్గొన్నారు.

యాడికిలో

యాడికి: పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని బస్టాండు సమీపంలో గాంధీ విగ్రహం వద్ద పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. గాంధీ కూడలి నుంచి కమలపాడు రహదారిలో ఉన్న విద్యుత్ కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్లి ఏఈ రాజారావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీటీసీలు వెంకటనాయుడు, నాగరాజు, రామ్మోహన్, వార్డు సభ్యులు తిరుపతి, రామచంద్ర, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గుంతకల్లులో ట్రాన్స్‌కో ఏడీఈ నాగేంద్రకు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, పార్టీనేతలు



శింగనమలలో వినతిపత్రం అందజేస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి, వీరాంజనేయులు



తాడిపత్రిలో ట్రాన్స్‌కో ఏడీకి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొనిదెల రమేష్‌రెడ్డి



యాడికిలో విద్యుత్ ఏఈ రాజారావుకు వినతి పత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మాట తప్పిన చంద్రబాబు

- శింగనమల సమన్వయకర్త వీరాంజనేయులు, ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల: ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి, అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట తప్పి విద్యుత్ చార్జీలు పెంచి, ప్రజలపై భారం మోపారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలూరు సాంబశివారెడ్డి, సమన్వయకర్త వీరాంజినేయులు ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు , మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శుక్రవారం విద్యుత్ చార్జీలను పెంచిన కూటమి ప్రభుత్వంపై నిరసనగా చేపట్టిన పోరుబాటు కార్యక్రమం శింగనమలలో వైఎస్సార్‌సీపీ నాయకులుడు ఆలూరు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యుత్ సబ్ స్టేషన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలకే మోస పోయామన్న బాధ అన్ని వర్గాల్లోనూ స్పష్టంగా కనిపిస్తుందన్నారు. దాదాపు రూ.15,400 కోట్లు ప్రజలపై భారం మోపారన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగనన్న పెట్టిన సంక్షేమ పథకాలతో పాటు, సూపర్ సిక్స్ పథకాలు అందిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన వాటిలో , కేవలం పింఛన్ మాత్రం చేపట్టి, ప్రజలను చంద్రబాబు మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వానికి పరిపాలన చేతకాక, జగనన్న పాలనపై మాట్లాడుతున్నారని విమర్శించారు. అనంతరం ట్రాన్స్‌కో ఏఈ విజయకుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, జెడ్పీటీసీలు భాస్కర్, భోగాతి ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీలు యోగేశ్వరి, నాగేశ్వర్, వెంకటనారాయణ, బీకేఎస్ మేజర్ సర్పంచ్ పార్వతి, వైఎస్సార్ సీపీ నాయకులు మిద్దె కుళ్లాయప్ప, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస నాయక్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి



ఎంఈఓ కార్యాలయం ఎదుట మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నాయకులు

గుంతకల్లు రూరల్: పన్నెండో పీఆర్సీకి సంబంధించిన మధ్యంతర భృతిని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యల సేకరణ, సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఎస్టీయూ సభ్యులు శుక్రవారం మండలంలోని అయ్యవారుపల్లి, కదిరిపల్లి, ఇమాంపురం, చింతలాంపల్లి, నాగసముద్రం, నెలగొండ, కసాపురం, దోసలుడుకి, గుండాలతండా, పాతకొత్తచెరువు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయుల ఆకాంక్షలకు అనుగుణంగా 12వ పీఆర్సీలో మధ్యంతర భృతిని ప్రకటించి, గత పీఆర్సీకి సబంధించిన బకాయిలను, పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలకు వెంటనే చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న అన్ని రకాల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

మున్సిపల్ కార్మిక సమస్యలపై ధర్నా



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

గుంతకల్లు: పట్టణ మున్సిపల్ కార్మిక సమస్యలపై శుక్రవారం ఏఐటీయూసీ, సీఐటీయూ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ధర్నాను ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించే విషయంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారన్నారు. పర్మినెంట్ కార్మికుల డీఏ అరియర్స్ కొన్ని ఏళ్లుగా సస్పెండ్ అకౌంట్‌లో ఉంది అంటున్నారే తప్ప ఇంతవరకు జమ కాలేదన్నారు. దాదాపు 42 మంది కార్మికుల డైలీ వైజ్ కింద కనీస వేతనం అమలు చేయడంతోపాటు పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్య కల్పించాలన్నారు. ఇక 14 నెలలుగా బకాయిపడ్డ క్లాప్ డ్రైవర్‌లకు జీతాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్డు కార్మికుల స్థానంలో వారి పిల్లలకు ఉద్యోగ అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో ఆయన చాంబర్‌కు వినత పత్రం అతికించి వచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎం.వీరభద్రస్వామి, సీపీఎం నాయకులు బీ.శ్రీనివాసులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించుకోండి



గుత్తి మండలం కరిడికొండలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు



గుంతకల్లు మండలం అయ్యవారిపల్లిలో మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి

గుత్తి రూరల్/గుంతకల్లు రూరల్/పామిడి/పెద్దవడుగూరు/గార్లదిన్నె: గ్రామాల్లో జరిగే రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలను పరిష్కరించుకోవాలని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు సూచించారు. గుత్తి మండలంలోని కరిడికొండ గ్రామంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు తహసీల్దార్ ఓబులేసుతో ఆర్డీఓ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎనిమిది మంది రైతులు అధికారులకు వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్‌బాబు, వీఆర్‌ఓలు సురేంద్ర, రంగస్వామి, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే గుంతకల్లు మండలంలోని అయ్యవారుపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ రమాదేవి, సర్పంచ్ వెంకటలక్ష్మి, ఇమాంపురం సర్పంచ్ రంగన్న, అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా పామిడి మండలంలోని తంబళ్లపల్లి, పాగరూరు గ్రామాల్లో శుక్రవారం తహసీల్దార్ శ్రీధర మూర్తి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తంబళ్లపల్లిలో 12, పాగరూరులో 8 అర్జీలు సమర్పించారు. కార్యక్రమాల్లో దేవదాయ శాఖ ఈఓ క్రిష్ణయ్య, పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది, ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్దవడుగూరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ప్రత్యేక అధికారి వెంకటరమణనాయక్, తహసీల్దార్ ఉషారాణి, వీఆర్వోలు, సర్వేయర్ పాల్గొన్నారు. గార్లదిన్నె మండలంలోని కోటంకలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ ఈరమ్మ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి



మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్దమౌనం పాటిస్తున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, పార్టీ నాయకులు

గుంతకల్లుటౌన్: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి వైఎస్సార్‌సీపీ సంతాపం తెలిపింది. శుక్రవారం స్థానిక టీవీ.స్టేషన్ సర్కిల్‌లో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ శ్రేణులంతా రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలియజేశారు.

మన్మోహనుడు విశ్వం మెచ్చిన ఆర్థిక చాణక్యుడని ఆయన కొనియాడారు. దేశం ఒక దార్శనికుడు, గొప్ప ఆర్థికవేత్తను కోల్పోయిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్, పార్టీ జిల్లా కార్యదర్శి గాదిలింగేశ్వరబాబు, మున్సిపల్ మాజీ చైర్మన్లు రామలింగప్ప, రామాంజనేయులు, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప, గుత్తి పట్టణ, మండల అధ్యక్షులు హుసేన్ పీరా, గోవర్ధన్‌రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్‌లు చెన్నకేశవరెడ్డి, మల్లయ్యయాదవ్, ప్రవీణ్‌యాదవ్, పామిడి పట్టణ అధ్యక్షుడు జోజోడే కుమార్, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, మల్లయ్యయాదవ్, బొల్లు వెంకటరామిరెడ్డి, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్‌సభ్యులు, వార్డు ఇన్‌చార్జ్‌లు, మూడు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

31న పింఛన్ల పంపిణీ

గుత్తి/గార్లదిన్నె: ఈ నెల 31నే పింఛన్ల సొమ్మును పంపిణీ చేస్తామని గుత్తి మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జనవరి 1వ తేదీకి ఒకరోజు ముందుగానే అంటే 31నే పింఛన్లను పంపిణీ చేస్తామన్నారు. లబ్ధిదారులు ఇంటి వద్దే ఉండి పింఛన్ తీసుకోవాలన్నారు. అలాగే గార్లదిన్నె మండలంలో ఈనెల 31న పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి తెలిపారు.

నేడు ప్రత్యేక పూజలు

బుక్కరాయసముద్రం:మండల కేంద్రంలోని చెరువు కట్ట సమీపంలోని శనీశ్వరుడి ఆలయంలో శనివారం శనిత్రయోదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు బాబా ప్రసాద్ తెలిపారు. ఆలయంలో ఉదయం గణపతిపూజ, సక్వస్తి పుణ్యహవచనం, కలశ స్థాపన, నవగ్రహ పూజ, శనీశ్వరునికి తైలాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

గౌతమేశ్వరాలయానికి దారి చూపండి



ఆలయ కమిటీ సభ్యులతో కలిసి గౌతమేశ్వర ఆలయాన్ని పరిశీలిస్తున్న విజయభాస్కర్

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లో పురాతన గౌతమేశ్వరాలయానికి దారి లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు వెంటనే దారి చేపాలని గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షులు విజయ భాస్కర్ కోరారు. గౌతమేశ్వరాలయాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ శేఖర్ రెడ్డి దేవాలయానికి దారి లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారని విన్నవించారు. ఆలయానికి రావాలంటే భక్తులు రైల్వే ట్రాక్ దాటి రావాల్సి వస్తోందన్నారు. రైల్వే ఉన్నతాధికారలతో మాట్లాడి దారి ఏర్పాటు చేయిస్తామని విజయ భాస్కర్ వారికి హామీ ఇచ్చారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

బుక్కరాయసముద్రం: గ్రామీణ ప్రాంతాలలో లిళిక సదుపాయాలు కల్పించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపడుతామని ఎంపీడీఓ సాల్మాన్, ఎంపీపీ సునీత అన్నారు. శుకవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దటి నివారణకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఎప్పటికప్పుడు సమస్యలు వెంటనే పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుణ్యవతి, ఎంఈఓలు నవీద, లింగా నాయక్, హౌసింగ్ డీఈ రామ్మూర్తి, ఐసీడీఎస్ సీడీపీఓ ఉమాశంకరమ్మ, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్రోఫీ అందజేత

తాడిపత్రి రూరల్: పట్టణ సమీపంలోని చర్చి స్కూల్‌లో నిర్వహించిన స్కూల్స్ గేమ్స్‌లో గెలుపొందిన విద్యార్థులకు శుక్రవారం రాత్రి అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి చాంపియన్ ట్రోఫీ అందజేశారు. తాడిపత్రి ప్రైవేట్ స్కూల్స్ ఆధ్వర్యంలో తాడిపత్రి టౌన్ లెవెన్ స్థాయిలో గేమ్స్ నిర్వహించారు.

'రేషన్ స్టాక్ పాయింట్‌లో అవకతవకలు'

తాడిపత్రి రూరల్: తాడిపత్రి మండలంలోని చిన్న పొలమడ వద్ద గల రేషన్ గోడౌన్ స్టాక్ పాయింట్‌లో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని జనసేన పార్టీ ఇన్‌చార్జ్ శ్రీకాంత్ రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ఆయన విలేకరల సమావేశంలో మాట్లాడారు. ప్రతి వంద కిలోల బస్తా నుంచి 5 కిలోల వరకూ తక్కువగా డీలర్లకు పంపుతూ గోడౌన్ ఇన్‌చార్జ్ శంకరయ్య అవినీతికి పాల్పడుతున్నారన్నారు. ఆయనపై ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. త్వరలో మంత్రి నాదేండ్ల మనోహర్ దృష్టికి అక్రమాల గురించి తీసుకెళ్లనున్నట్లు ఆయన తెలిపారు.

మహిళపై రాయితో దాడి

గార్లదిన్నె: మండలంలోని పెనకచెర్ల డ్యాంలో ఓ మహిళపై రాయితో దాడి చేసి గాయపరిచిన సంఘటన చోటు చేసుకుంది. శుక్రవారం ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా మాట్లాడుతూ గ్రామానికి చెందిన వెంకటలక్ష్మి, కుళ్లాయప్ప అనే దంపతులు కిరాణా అంగడి నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు.అదే గ్రామానికి చెందిన వినయ్ అనే చిన్నారి గురువారం రూ.20 తీసుకుని కిరాణా అంగడికి వెళ్లి కురు కురే ప్యాకెట్ ఇవ్వాలని అడుగగా చిల్లర లేదని వెనక్కు పంపారన్నారు. దీంతో చిన్నారి తండ్రి శివ కిరాణా అంగడి వద్దకు వెళ్లి వారితో గొడవ పడ్డాడన్నారు. స్థానికులు సర్ది చెప్పడంతో అక్కడి నుంచి వెళ్లిపోయాడన్నారు.తిరిగి రాత్రి సమయంలో శివ కిరాణా అంగడి వద్దకు వచ్చి వారితో గొడవ పడ్డాడన్నారు. ఈక్రమంలో శివ రాయితో వెంకటలక్ష్మిపై దాడి చేయడంతో తలకు గాయమైంది. ఆమె అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడు శివపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.